ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 120 చీఫ్ ఎడిటర్.. కలికి ఉదయ్ కుమార్ రెడ్డి, పేజీలు : 08, వెల రూ. 1/- ఆదివారం - 31వ - మే - 2026

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

### సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం

పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం

సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన

విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం



ఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను మిగతా 2 లో

## హైదరాబాద్ శివారులోని ముష్కిన్ చెరువు కబ్జా యత్నం భగ్నం



- చెరువు మధ్యలో కట్ట నిర్మించి.. రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా
- చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను కూల్చివేసిన హైడ్రా

## సీఎల్పీ సమావేశానికి ముందే గవర్నర్‌తో డీకే భేటీ



కర్ణాటక: కర్ణాటక ముఖ్యమంత్రి పదవి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అనూహ్యంగా పావులు కదిపారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశం జరగడానికి ముందే ఆయన శనివారం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్‌తో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తన సోదరుడు, మాజీ ఎంపీ మిగతా 2 లో

# పోలవరం అడవుల్లో పులి సంచారం.. అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

### పులి దాడిలో 9 దూడలు మృతి చెందడంపై అధికారుల అప్రమత్తం

అమరావతి: పోలవరం జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. మిగతా 2 లో






- పులిని బంధించాలని అటవీ శాఖకు డిప్యూటీ సీఎం ఆదేశం
- అధునాతన టెక్నాలజీతో 24 గంటల పర్యవేక్షణకు ఏర్పాట్లు



## సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారు దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి

- "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు
- మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు
- రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు.

అమరావతి: గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్ట్రేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. మిగతా 2 లో



114 సంస్థలకు 1,269 ఎకరాల

## భూమిని కేటాయించాం

- అమరావతిలో 114 సంస్థలకు భూముల కేటాయింపు
- వీటిలో 70 ప్రభుత్వ సంస్థలు, 44 ప్రైవేటు సంస్థలు ఉన్నాయని వెల్లడి
- తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదన్న మంత్రి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి భూ కేటాయింపులు, నిర్మాణ పనుల పురోగతిపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ మిగతా 2 లో

వచ్చే ఏడాది కేటీఆర్ పాదయాత్ర..

## కేసీఆర్ బస్సు యాత్ర

### అసెంబ్లీ ఎన్నికల దిశగా క్షేత్ర స్థాయిలో జోరు పెంచే యోచన

- బీఆర్ఎస్ భారీ వ్యూహం.. కేసీఆర్ దూకుడు
- కాంగ్రెస్ హామీల అమలు వైఫల్యంపై నిరంతర రాజకీయ దాడి
- కాంగ్రెస్ వ్యతిరేక ఓటు బీజేపీ వైపు వెళ్లకుండా ప్రత్యేక ప్రణాళిక
- సంస్థాగతంగా పార్టీ బలోపేతం దిశగా కార్యాచరణ షురూ
- 'సర్'పై అవగాహన పేరిట గ్రేటర్ ఎన్నికలపై స్పెషల్ నజర్
- 'జెన్ జీ'ని చేరుకోవడం లక్ష్యంగా ప్రత్యేకంగా ముఖాముఖీలు




హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిస్తున్న రాజకీయ పోరుకు మరింత పదును పెట్టేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమైంది. ఎన్నికల హామీల అమలులో వైఫల్యం, మిగతా 2 లో

రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి

## 'ఏపీ సైబర్ గార్డ్' ఏర్పాటు

### డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి

- ఫిర్యాదు అందిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలు
- ఆరు స్తంభాల వ్యవస్థతో సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రణాళిక
- ఏపీలో నేరం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని సీఎం స్పష్టం



అమరావతి: "డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" మిగతా 2 లో




## నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?"

### నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు: కేటీఆర్

- ముషీరాబాద్ బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న కేటీఆర్
- గ్రామాల్లో జనాలు కాంగ్రెస్ ను దారుణంగా తిడుతున్నారని వ్యాఖ్య
- కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శ

హైదరాబాద్: తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత మిగతా 2 లో




రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

- మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,
- తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా, నిస్సిగ్గుగా వ్యవహరిస్తోంది
- రాష్ట్ర ప్రభుత్వం చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు: కిషన్ రెడ్డి
- రైతులు ఇబ్బంది పడుతుంటే.. మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని విమర్శ

నెలలో మూడు రోజులు వారి కోసం

# సమయం కేటాయిస్తా

### క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తా

- ఇకపై 10 రోజులకోసారి కార్యకర్తలను కలుస్తా
- అప్పుడు పనిచేసిన వారిని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి..
- సోషల్ మీడియాలో వ్యక్తిగత ప్రచారమేనా.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల గురించి చెప్పరా?
- పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి చురక



హైదరాబాద్: ఇకపై క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తానని.. నెలలో మూడు రోజులు వారి కోసం సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాల్సిందేనన్నారు. గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. "మంత్రులు.. తాము ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లాకు ప్రతి 10 రోజుల్లో ఒకరోజు వెళ్లి.. పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా సమయం కేటాయించాలి. మిగతా 2 లో

## ప్రాజెక్టుల పూర్తికి తగడువు విధించండి: సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు




- రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదు

## రాజస్థాన్‌లోని పలు జిల్లాలను
# ముంచెత్తిన ఇసుక తుఫాను

రాజస్థాన్: రాజస్థాన్‌లోని పలు జిల్లాలను శనివారం శక్తిమంతమైన ఇసుక తుపాను ముంచెత్తింది. దట్టమైన ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా అంధకారంగా మారింది. ఇసుక తుపాను అనంతరం భారీ వర్షం కురిసింది. ఈ తుపాను ప్రభావం చురు జిల్లాపై అధికంగా కనిపించగా, బికనీర్, శ్రీ గంగానగర్ జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 30 నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ గాలులకు ఇసుక భారీగా కొట్టుకొచ్చి రోడ్లు, నివాస ప్రాంతాలను కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై కొన్ని అడుగుల మేర ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను సమయంలో దారి కనిపించక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ అలజడుల ప్రభావం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ఉరుములు, వర్షాలతో కూడిన ఇసుక తుపానులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుల వల్ల తీవ్రమైన ఎండల నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలుగుతోంది. శ్రీ గంగానగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటడం అక్కడి తీవ్ర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం గానీ జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ బికనీర్, షెఖావతి ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

## ప్రాజెక్టుల పూర్తికి తగడువు విధించండి
# సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

అమరావతి: రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని, వాటి పూర్తికి కచ్చితమైన కాలపరిమితి నిర్దేశించుకుని పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్టీసీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులతో పాటు దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల పనులపైనా చర్చించారు. "ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవ తేదీలు ప్రకటించాం. పెద్ద పరిశ్రమలను 18 నెలల్లోగా ఉత్పత్తి ప్రారంభించాలని చెబుతున్నాం. అదే తరహాలో ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను పూర్తి చేయాలి. దశాబ్దాల తరబడి జాప్యం చేయడం సరైన విధానం కాదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల సమీకరణ, టెండర్ల ప్రక్రియ వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆర్టీసీపై జరిగిన సమీక్షలో, సంస్థ ఆస్తులను సద్వినియోగం చేసుకుని, బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈవీ బస్సుల కొనుగోళ్లపై కూడా అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ శివారులోని ముష్కిన్ చెరువు కబ్జా యత్నం భగ్నం

హైదరాబాద్: హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ (ప్రొటెక్షన్ ఏజెన్సీ) అధికారులు భగ్నం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలోని పుప్పాలగూడ, నార్సింగి సమీపంలో ఉన్న ముష్కిన్ చెరువును ఆక్రమించుకునేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. సుమారు రూ.5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. వివరాల్లోకి వెళితే, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముష్కిన్ చెరువుపై కన్నేశారు. పేదలతో గుడిసెలు వేయించి, భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామ రికార్డుల ప్రకారం 59.11 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు మధ్యలో ఏకంగా మట్టితో కట్ట నిర్మించి, 34 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేసేందుకు ప్లాన్ చేశారు. ఈ విషయంపై దృష్టి సారించిన హైడ్రా అధికారులు, ఆక్రమణదారులకు రెండు నెలల క్రితమే నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో శనివారం చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను, గుడిసెలను పూర్తిగా తొలగించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు సరిహద్దుల వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. నగరంలోని చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆధునిక యుద్ధాల్లో ఏఐ కీలకం..
# భవిష్యత్ యుద్ధాలకు అదే ఆయుధం: ఆర్మీ చీఫ్

ఢిల్లీ: ఆధునిక యుద్ధ క్షేత్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోందని, వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. మారుతున్న యుద్ధ తంత్రంలో వస్తున్న సంక్లిష్టతలను అధిగమించేందుకు కొత్త టెక్నాలజీలు తప్పనిసరిగా అవసరం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం నాడు పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో 150వ కోర్సు పాసింగ్ అవుట్ పరేడ్‌ను సమీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత యుద్ధ క్షేత్రాలు భారీ స్థాయిలో సమాచారాన్ని సృష్టిస్తున్నాయని, అనేక రకాల వనరులు ఇందులో భాగమవుతున్నాయని జనరల్ ద్వివేది వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో కమాండర్లు, సైనికులు వేగంగా సమాచారాన్ని విశ్లేషించి, తక్షణమే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. "యుద్ధ వేగం ఎక్కువగా ఉన్నప్పుడు, వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అదనపు సాంకేతిక మద్దతు అవసరం. ఇక్కడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవసరం ఏర్పడుతుంది. భారీ వనరులను ఒకేసారి నియంత్రించడం కష్టమైనప్పుడు ఏఐ సాయపడుతుంది" అని ఆయన తెలిపారు. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో 'అబ్జర్వ్, ఓరియెంట్, డిసైడ్, యాక్ట్' (ఓఓడీఏ) అనే సైకిల్ ఉంటుందని, సంక్లిష్ట పరిస్థితుల్లో దీనిని వేగవంతం చేసేందుకు ఏఐ టెక్నాలజీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వంటివి సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేయడానికి, వనరులను సమర్థవంతంగా కేటాయించడానికి దోహదపడతాయని అన్నారు. ఇదే సమయంలో సైనిక కార్యకలాపాల్లో డ్రోన్ల పాత్ర కూడా గణనీయంగా పెరిగిందని జనరల్ ద్వివేది హైలైట్ చేశారు. "ప్రస్తుత వాతావరణంలో, శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు అధికంగా ఉంది. వాటిని ఎదుర్కోవడానికి మనకు కౌంటర్-డ్రోన్ వ్యవస్థలు అవసరం. అదే సమయంలో, మన డ్రోన్లను కూడా సమర్థంగా ఉపయోగించుకోవాలి. యుద్ధ క్షేత్రంలో వనరులు భారీగా పెరిగిపోయాయి" అని ఆయన పేర్కొన్నారు. డ్రోన్లు, సెన్సార్లు, నిఘా పరికరాలు వంటి వాటిని సమర్థంగా నిర్వహించడానికి ఆటోమేషన్ తప్పనిసరి అని, ఇందుకు ఏఐ కీలకమైన సాధనంగా నిలుస్తుందని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు.

# మరో ఆపరేషన్ సిందూర్‌కు సైన్యం సిద్ధం..

ఢిల్లీ: భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం త్రివిధ దళాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సరిహద్దుల్లో ప్రస్తుత ప్రశాంతత కేవలం తాత్కాలికమేనని తెలిపారు. శత్రు దేశాల కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని స్పష్టం చేశారు.

పటిష్ఠంగా వ్యూహాలు

ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా త్రివిధ దళాల మధ్య సమన్వయం పెంచుతున్నట్లు ద్వివేది తెలిపారు. యుద్ధరంగంలో ప్రతి కదలిక స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. అందుకే సైనికులతో పాటు పౌరుల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 24 గంటలూ రక్షణ దళాలు అప్రమత్తంగా ఉంటున్నాయని వివరించారు.

సమాచార యుద్ధంలో ప్రజల పాత్ర

సమాచార యుద్ధంలో విజయం సాధించాలంటే దేశ ప్రజల మద్దతు ఎంతో అవసరమని జనరల్ ద్వివేది పేర్కొన్నారు. అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రజలు విశ్వసించాలని పిలుపునిచ్చారు. దేశమంతా ఒకే తాటిపైకి వచ్చినప్పుడే శత్రువుపై విజయం సాధ్యమవుతుందని వివరించారు.

## రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం
# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

హైదరాబాద్: మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా, నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళారులు, రైస్ మిల్లర్ల చేతుల్లో చిక్కి రైతులు విలవిలలాడుతుంటే, మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని మండిపడ్డారు. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టేయాలని చూస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ఎప్పుడూ తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యాన్ని సేకరిస్తోందని స్పష్టం చేశారు. 52.24 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందానికి గాను, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించగలిగిందని గణాంకాలను వెల్లడించారు. ఇక్కడ పండే నాణ్యమైన సన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటూ, పేద ప్రజలకు మాత్రం ఇతర రాష్ట్రాల నుండి తెచ్చిన నాసిరకం బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం కమీషన్లు, భూ దందాలపైనే శ్రద్ధ పెడుతూ, రైతుల ఉసురు పోసుకుంటున్నాయని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?"

హైదరాబాద్: తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శల జడివాన కురిపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ వస్తే రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా ఇవాళ తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## నెలలో మూడు రోజులు వారి కోసం
# సమయం కేటాయిస్తా

మొదటి పేజి తరువాయి

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, సీనియర్ నాయకులు వారంలో ఒకరోజు నియోజకవర్గాలకు వెళ్లి కార్యకర్తలను కలవాలి. నాతో సహా ఎవరు ఎక్కడికి వెళ్లాలనేది పీసీసీ అధ్యక్షుడు నిర్ణయిస్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ క్యాడర్.. సోషల్ మీడియా వారియర్లుగా మారి పార్టీ కోసం పనిచేశారు. కానీ, ఇప్పుడు కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లలా తయారయ్యారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ప్రచారం చేసుకోవడమే తప్ప.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయనీయడం లేదు. పార్టీ కోసం సోషల్ మీడియా వినియోగంపై ఎమ్మెల్యేలకు శిక్షణ ఇవ్వాలి.

'సర్'పై సమన్వయంతో పనిచేయాలి..

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం(సర్)పై పార్టీ నాయకులంతా సమన్వయంతో పనిచేయాలి. నేతలు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు పోలింగ్ బూత్ స్థాయిలో పనిచేస్తారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించాలి. నగర పరిధిలోని 15 నియోజకవర్గాలవారీగా 'సర్'పై సమావేశాలు పెట్టాలి. మహిళా కాంగ్రెస్ తరఫున క్లస్టర్ల వారీగా భేటీలు నిర్వహించాలి. 'సర్'లో భాగంగా ఓట్ల తొలగింపుతో సామాన్యులు, పేదలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం. లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చు. దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యలకు పరిష్కారంపై అందరూ సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి.

అప్పుడు పనిచేసిన వారిని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి..

గతంలో డిజిటల్ విధానంలో ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి రాహుల్‌గాంధీతో సన్మానం చేయించాం. అప్పుడు కీలకపాత్ర పోషించిన వారిని ఇప్పుడు 'సర్' కార్యక్రమంలో పనిచేసేలా పరిగణనలోకి తీసుకోవాలి. 119 అసెంబ్లీ, 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 'సర్' పర్యవేక్షణకు ఇన్‌ఛార్జులను నియమించాలి. అసెంబ్లీ ఇన్‌ఛార్జులు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందే. వారు సరిగా పనిచేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చు. ఈ విషయంలో పీసీసీ మాజీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. దాదాపుగా నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేశాం. పార్టీ తరఫున ఇప్పుడు వేల మంది సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు ఉన్నారు. వలస పోయిన వారి ఓట్లు తొలగించకుండా వారంతా జాగ్రత్తలు తీసుకోవాలి" అని సీఎం చెప్పినట్లు పార్టీ వర్గాలు వివరించాయి. 'సర్' విషయంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై మంత్రులు, ఇతర నేతలు తమ అభిప్రాయాలను ఈ సందర్భంగా చెప్పారు. ఒక నాయకుడు మాట్లాడుతుండగా.. సీఎం కల్పించుకుని ముందు గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు?, పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామకాలు ఇంకా ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించినట్లు తెలిసింది.

## రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి
# 'ఏపీ సైబర్ గార్డ్' ఏర్పాటు

అమరావతి: "డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు శాఖను ఆదేశించారు. ఏళ్ల తరబడి కష్టపడి దాచుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచుకుంటుంటే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఈ పరిస్థితిని అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని సైబర్ నేర రహితంగా మార్చడమే లక్ష్యమని, ఏపీ ప్రజలను మోసం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని ఆయన హెచ్చరించారు. సచివాలయంలో సైబర్ నేరాల కట్టడిపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సైబర్ నేరాలను సమూలంగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. దీనికి సంబంధించిన కార్యాచరణను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రికి వివరించారు. ఆరు స్తంభాల (6 పిల్లర్స్) ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్‌బోర్డ్, టెక్నాలజీ-ఏఐ వినియోగం, పోలీసులకు శిక్షణ, 3-టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటివి ఉంటాయని పేర్కొన్నారు. మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్'లో అత్యాధునిక సదుపాయాలతో రాష్ట్రస్థాయి సైబర్ వార్ రూం ఏర్పాటు చేస్తున్నామని, ఇది 30 రోజుల్లో అందుబాటులోకి వస్తుందని డీజీపీ తెలిపారు. సైబర్ మోసంపై ఫిర్యాదు అందిన వెంటనే 'జీరో ఎఫ్‌ఐఆర్' నమోదు చేసి, గోల్డెన్ అవర్ టైంలో స్పందించి బాధితుల డబ్బు బదిలీ కాకుండా చూడాలని సీఎం సూచించారు. ఇందుకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. పోలీసు పెట్రోలింగ్ తరహాలోనే 'సైబర్ పెట్రోలింగ్' కూడా నిరంతరం జరగాలని చంద్రబాబు అన్నారు. నేరం జరగకముందే ప్రజలను అప్రమత్తం చేయడంపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాలపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి వీబశ్రీవఎబత్‌వతీ:ూ× వంటి టెక్నాలజీలను వాడతామని, ఏడాదిలో 500 మంది పోలీసు అధికారులకు శిక్షణ ఇస్తామని డీజీపీ వివరించారు. 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు, 4 ప్రాంతీయ హబ్‌లు ఏర్పాటు చేసి నేరాలకు అడ్డుకట్ట వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎల్పీ సమావేశానికి ముందే
# గవర్నర్‌తో డీకే భేటీ

మొదటి పేజి తరువాయి

తన సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్‌తో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన, గవర్నర్‌తో అనధికారికంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రిగా తనను ఎన్నుకునే పక్షంలో ప్రమాణ స్వీకార ఏర్పాట్లు, తేదీలపై చర్చించేందుకే ఈ భేటీ జరిగిందని శివకుమార్ వర్గాలు చెబుతున్నాయి. జ్యోతిష్కులు సూచించిన ప్రకారం జూన్ 1, 3, 5 తేదీల్లో ఒక మంచి ముహూర్తాన్ని ఖరారు చేసే అంశంపై గవర్నర్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జూన్ 3వ తేదీన ప్రమాణ స్వీకారం చేసేందుకు డీకే శివకుమార్ మొగ్గు చూపుతున్నారని, ఈ విషయాన్ని గవర్నర్ కార్యాలయానికి కూడా చేరవేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రమాణ స్వీకార వేదికగా విధాన సౌధ మెట్ల భాగాన్ని గానీ, రాజ్‌భవన్‌ను గానీ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో ఉప ముఖ్యమంత్రి పదవుల కోసం తీవ్రమైన లాబీయింగ్ మొదలైంది. లింగాయత్ వర్గం నుంచి సీనియర్ నేతలు ఎం.బీ. పాటిల్, ఈశ్వర్ ఖండ్రే ఈ పదవిని ఆశిస్తున్నారు. అలాగే, మాజీ స్పీకర్ యూటీ ఖాదర్, సీనియర్ ఎమ్మెల్యే తన్వీర్ సైత్, సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడైన జమీర్ అహ్మద్ ఖాన్ కూడా డిప్యూటీ సీఎం రేసులో ఉన్నారు. ఎస్సీ వర్గం నుంచి సీనియర్ నేతలు జి.పరమేశ్వర, హెచ్.సి. మహదేవప్ప కూడా ఆశలు పెట్టుకున్నారు. అయితే, వివిధ వర్గాల నుంచి తీవ్రమైన పోటీ ఉండటంతో పార్టీలో అనవసర విభేదాలు రాకుండా ఉండేందుకు అసలు డిప్యూటీ సీఎం పదవులే లేకుండా చేయాలనే ఆలోచనను కూడా కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. కొత్త ముఖ్యమంత్రితో పాటు దాదాపు 12 నుంచి 14 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సీఎల్పీ సమావేశం సాయంత్రం 4 గంటలకు జరగనుండగా, అంతకుముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం కర్ణాటక రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.

## సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని
# ప్రజలు బాగా గుర్తించారు

మొదటి పేజి తరువాయి

సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారు. మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు. వీళ్లు మాత్రం గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారు? వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉంది. ఆమె పోరాటం వల్లే ఇప్పటికీ ఆ హత్య కేసు సజీవంగా ఉంది. నేటి తరానికి కూడా వీళ్ల హత్యా రాజకీయాలు తెలుస్తున్నాయి" "నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులపై కేంద్రం పట్టుదలగా ఉంది. ఇవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి. రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. బిల్లులను గతంలో వ్యతిరేకించిన వారి ఆలోచనలు ఇప్పుడు మారొచ్చు. తెదేపా ప్రకటించిన 33 శాతం రిజర్వేషన్లు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. మహిళలకు మొదటినుంచి మా పార్టీ అండగా ఉంది. పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా మనకు నష్టం. ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే ఎవరికీ నష్టం ఉండదు" అని ముఖ్యమంత్రి తెలిపారు.

### బక్కని నర్సింహులు వ్యాఖ్యలు సరికాదు: చంద్రబాబు

తెదేపా జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమావేశమయ్యారు. హైబ్రిడ్ మహానాడు విజయవంతమైందన్నారు. మహానాడు సందర్భంగా తెలంగాణ తెదేపా నేత బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి తప్పుపట్టారు. తెలంగాణపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏ ఒక్కరీ మనోభావాలు దెబ్బతీయకూడదని సూచించారు. తెలుగు జాతి ఒక్కటేనని చెప్పారు. తెదేపా పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. ఆ రాష్ట్రంలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉందన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. రాజ్యసభ స్థానాలకు అవకాశం కల్పించాలని పలువురు ఆశావహులు ఆయన్ను కోరారు. వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్‌రావు, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## పోలవరం అడవుల్లో పులి సంచారం..
# అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

మొదటి పేజి తరువాయి

ప్రజలు, పశువుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పులి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల పోలవరం జిల్లాలోని చికిలింత పంచాయతీలో పులి దాడి చేసి 9 దూడలను చంపిన ఘటనపై పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ పులి తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్‌లో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. దీనిపై సమీక్ష నిర్వహించిన ఆయన, పులి వల్ల మనుషులకు, పశువులకు ఎలాంటి హాని జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డ్రోన్లు, ట్రాప్ కెమెరాల వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని పవన్ సూచించారు. 24 గంటల పాటు నిఘా కోసం ప్రత్యేక 'హనుమాన్' బృందాలను రంగంలోకి దించాలని, అవసరమైతే వాటి సంఖ్యను పెంచాలని అన్నారు. పులిని సురక్షితంగా బంధించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) స్థాయి అధికారి ఈ ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, పశువులను కోల్పోయిన రైతులకు తక్షణమే మధ్యంతర పరిహారం అందించినట్లు, పూర్తి నష్టపరిహారాన్ని త్వరలో చెల్లిస్తామని అధికారులు పవన్‌కు వివరించారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని కూడా ఆయన ఆదేశించారు.

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను
## సరిగ్గా నిర్వహించడం లేదు: రాహుల్ గాంధీ

ఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

# గాదె వెంకటరెడ్డి మృతిపై రేవంత్ సంతాపం

హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి (85) మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాదె వెంకటరెడ్డి రాజకీయాల్లో అత్యంత సౌమ్యుడు, సహనశీలిగా పేరుగాంచారని, ఆయన హయాంలో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారని రేవంత్ కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర శాసనసభకు ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించిన ఆయన, మంత్రిగా వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో ఆయన లేని లోటు తీర్చలేనిదని సీఎం పేర్కొన్నారు. 1940 జులై 10న ప్రకాశం జిల్లా పావులూరులో జన్మించిన గాదె వెంకటరెడ్డి న్యాయశాస్త్రం అభ్యసించారు. ప్రజాసేవపై ఉన్న ఆసక్తితో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1967లో పర్చూరు నియోజకవర్గం నుండి తన 27వ ఏటనే తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 1991 (ఉప ఎన్నిక), 1994లో పర్చూరు నుండి, అలాగే 2004, 2009లలో బాపట్ల నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా విజయం సాధించారు. ఉమ్మడి ఏపీలో అగ్ర నేతలైన నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్యల మంత్రివర్గాల్లో దేవాదాయ శాఖతో పాటు పలు కీలక శాఖల మంత్రిగా ఆయన సమర్థవంతంగా సేవలందించారు. కాంగ్రెస్ తర్వాత ఆయన తెలుగుదేశం పార్టీ, వైసీపీలలో కూడా కొనసాగారు. ఒక విలువలతో కూడిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని ముగించి నిష్క్రమించిన గాదె వెంకటరెడ్డి మృతి పట్ల రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## 114 సంస్థలకు 1,269 ఎకరాల భూమిని కేటాయించాం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి భూ కేటాయింపులు, నిర్మాణ పనుల పురోగతిపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ కీలక వివరాలను వెల్లడించారు. రాజధానిలో భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతిలో ఇప్పటివరకు మొత్తం 114 సంస్థలకు 1,269 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో 70 ప్రభుత్వ సంస్థలు, 44 ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. అయితే, ఈ మొత్తం 114 సంస్థల్లో 3 సంస్థలు కొన్ని కారణాల వల్ల తమ కేటాయింపులను రద్దు చేసుకోగా.. మరో 3 సంస్థలకు గతంలో కేటాయించిన స్థలానికి బదులుగా వేరే చోట భూమిని కేటాయించినట్లు మంత్రి వివరించారు. అమరావతిలో స్టూడియోలు లేదా ఇతర సంస్థల స్థాపన కోసం తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రతిపాదనలు రాలేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అయితే, ముంబైకి చెందిన కొన్ని ప్రముఖ సినీ, వ్యాపార సంస్థలు అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు, భూముల కోసం ముందుకు వచ్చాయని తెలిపారు. రాజధానిలో భూములు కోరుతూ ముందుకు వచ్చే సంస్థల ఆర్థిక సామర్థ్యాన్ని నిశితంగా పరిశీలించిన తర్వాతే కేటాయింపులు జరుగుతాయని మంత్రి చెప్పారు. అందుకోసం సదరు సంస్థల ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు, బ్యాలెన్స్ షీట్లను సమర్పించాలని కోరుతున్నట్లు వెల్లడించారు. రాజధాని నిర్మాణ పనులకు ఎలాంటి డీజిల్ కొరత లేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా భారీ నిర్మాణాలను వాయిదా వేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించినప్పటికీ.. అమరావతి రాష్ట్ర భవిష్యత్తు, రాజధాని కావడంతో పనులను ఎక్కడా ఆపకుండా కొనసాగిస్తున్నామని చెప్పారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు ఎంతో నమ్మకంతో తమ భూములను త్యాగం చేశారని, కానీ గత ఐదేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తిగా నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా పనులను నిలిపివేస్తే రైతులు కోలుకోలేని విధంగా నష్టపోతారని, వారి ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని నారాయణ పేర్కొన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా రాజధాని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## వచ్చే ఏడాది కేటీఆర్ పాదయాత్ర.. కేసీఆర్ బస్సు యాత్ర

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిస్తున్న రాజకీయ పోరుకు మరింత పదును పెట్టేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమైంది. ఎన్నికల హామీల అమలులో వైఫల్యం, ప్రజాసమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, పాలనలో అవినీతి, అధికార పార్టీ నేతల అక్రమాలపై ఆరోపణలను ప్రధాన అస్త్రాలుగా మలుచుకోవాలని గులాబీ పార్టీ నిర్ణయించింది. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన కార్మికుల మద్దతు కూడగట్టేలా ప్రభుత్వాన్ని నిరంతరం ప్రజాక్షేత్రంలో నిలదీసేందుకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేసే కసరత్తు ప్రారంభించింది.

అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార కాంగ్రెస్ వ్యతిరేక ఓటు చీలి బీజేపీ వైపు మళ్లకుండా రాజకీయంగా అడ్డుకట్ట వేసే వ్యూహం కూడా అవసరమని భావిస్తోంది. యువతను ఆకర్షించే కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగంలో చురుకుదనం పెంచడం, భవిష్యత్‌లో కేటీఆర్ పాదయాత్ర, కేసీఆర్ బస్సు యాత్రల వంటి భారీ ప్రజా కార్యక్రమాలతో మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో దూకుడు పెంచేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే అంశాన్ని క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇప్పటికే వరంగల్‌లో రైతు సదస్సు నిర్వహించిన బీఆర్ఎస్ త్వరలో తెలంగాణ భవన్‌లో యువజన, విద్యార్థి నేతలతో సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. రైతుభరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు హామీలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతర రాజకీయ ఒత్తిడి తీసుకురావాలని పార్టీ నిర్ణయించింది.

అక్రమాలు, అవినీతి ఆరోపణలను ప్రజల ముందుంచడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ విశ్వసనీయతపై ప్రజల్లో నిరంతరం చర్చ జరిగేలా చూడాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావులతోపాటు పార్టీ ముఖ్య నేతలు రేవంత్ ప్రభుత్వంపై రోజుకో ఆరోపణ, విమర్శలతో విరుచుకుపడుతున్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఇప్పటికే అసెంబ్లీతోపాటు ప్రజా వేదికలు, సామాజిక మాధ్యమాలు, జిల్లా స్థాయిలో కార్యక్రమాల ద్వారా ఈ అంశాలను ప్రజల్లోకి నిరంతరం తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడంపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణ, క్రియాశీల కార్యకర్తల గుర్తింపు, యువ నాయకత్వానికి ప్రాధాన్యం వంటి అంశాలపై కార్యాచరణ ప్రారంభించింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని మరింత బలోపేతం చేయాలని పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఓట్ల రూపంలో మార్చుకోవడానికి ఇప్పటి నుంచే బూత్ స్థాయి నుంచే పార్టీ వ్యవస్థను పటిష్టం చేసే పనులు ప్రారంభమైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గ్రేటర్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన మూడు కార్పొరేషన్లలో నెలకొన్న రాజకీయ పరిణామాలను కూడా బీఆర్ఎస్ అత్యంత కీలకంగా చూస్తోంది. 'సర్'పై అవగాహన కార్యక్రమాల పేరిట నగర ఓటర్లతో మరింత సన్నిహిత సంబంధాలు పెంచుకోవాలని పార్టీ యోచిస్తోంది. సర్‌పై కేటీఆర్ గ్రేటర్ పరిధిలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు డిజిటల్ యుగంలో కీలకంగా మారుతున్న 'జెన్ జీ'యువతను ఆకర్షించేందుకు ప్రత్యేక ముఖాముఖి సమావేశాలు, ఇంటరాక్టివ్ కార్యక్రమాలు నిర్వహించే ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

VIGNAN PATRIKA APTEL/2024/89102

విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)




## ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో కడపత్ర లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

ప్రజలకు చేరువలో ప్రభుత్వ సేవలు నెలవల స్పష్టం

నియోజకవర్గం ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

177 అర్జీల స్వీకరణ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ముందడుగు

ప్రజా సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ..

ప్రజలతో నేరుగా మమేకమవుతున్న ఎమ్మెల్యే

కడపత్రలో ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికే ఎమ్మెల్యే స్పష్టం



సూళ్లూరుపేట.. మే. 30/(విజ్ఞాన్ ప్రతి నిది ).. : సూళ్లూరుపేట నియోజకవర్గం లో ప్రతి వారం నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే అని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శనివారం సూళ్లూరుపేట మండలం కడపత్ర పంచాయతీలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. పంచాయతీలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అటు అభివృద్ధి ఇటు సంక్షేమ కోసం శ్రమిస్తూ రాష్ట్రాన్ని సరైన గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కడపత్ర పంచాయతీలో వచ్చిన 177 అర్జీలను వివిధ శాఖల అధికారులకు పంపి త్వరితగతిన సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శైలాకుమారి, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, తెదేపా రూరల్ అధ్యక్షులు పాకం వెంకటసుబ్బయ్య, మాజీ రూరల్ అధ్యక్షులు కొక్కు శంకరయ్య, మాజీ సర్పంచ్ లు వెంకటేశ్వర్లు, తిరుపాలు, యల్లయ్య, సుధాకర్ రెడ్డి, మురళి రెడ్డి,మండల ఐ టీడీపీ అధ్యక్షులు ప్రభాకర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అర్జీదారులు పాల్గొన్నారు..

## విజేతలకు బహుమతులు

(ఫొటో - గ్రంథాలయంలో జరిగిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేస్తున్న మాజీ చైర్మన్ ఖుద్దూస్, మధు)



**విజ్ఞాన్ దినపత్రిక కృష్ణా జిల్లా ప్రతినిధి ఉయ్యూరు :** విజ్ఞాన సమపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉయ్యూరు మున్సిపల్ మాజీ చైర్మన్ ఖుద్దూస్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరానికి శనివారం ఆయన ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చిన్ననాటి నుండి గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవడం అలవరుచుకోవాలన్నారు . సూర్య కుటుంబం వాటియొక్క వాస్తవికతను రిసోర్స్పర్సన్ సీహెచ్ మహాలక్ష్మి వివరించారు. పొడుపు కథలపై ప్రశ్నలు అడిగి జవాబులు చెప్పినవారికి ఎల్ఏసీఏజెం ట్ గుర్రాల మధు బహుమతులు అందచేశారు. జనసేన నాయకుడు బి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

(పొటో- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని గండిగుంటలో ఇంటింటి ప్రచారంలో ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్, హెచ్ఎం నాగేశ్వరరావు)



**విజ్ఞానం దినపత్రిక కృష్ణా జిల్లా ప్రతినిధి ఉయ్యూరు :** ప్రభుత్వపాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలుచేస్తుందని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి, మెరుగైన సౌకర్యాలు, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు తెలియచేస్తూ శనివారం ఉపాధ్యాయులతో కలిసి గండిగుంట, ఉయ్యూరులో పర్యటిం చి ఇంటింట ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ యువత భవిష్యత్తుకు పునాదివేసేలా మెరుగైన విద్యావ్యవస్థ రూపొందించారని, గడచిన పదవతరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనపరచడం నిదర్శనమన్నారు. తలితండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఉయ్యూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం టీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సురేఖ, హనుమాయమ్మ, సీఆర్పీ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

(ఫొటో - బస్ స్టాండ్ సమీపాన పంటకాల్వలో చెత్త పారిశుధ్య కార్మికులతో కలసి శు భ్రంచేస్తున్న మున్సిపల్ కమిషనర్ సుబాష్ చంద్రబోస్ )



**విజ్ఞాన్ దినపత్రిక కృష్ణాజిల్లా ప్రతినిధి ,ఉయ్యూరు :** ఇళ్లలో చెత్త కాల్వలు, రోడ్లపై పోయకుండా పారిశుధ్యకార్మికులకు అందచేసి పరిసరాల పరిశుభ్రత పాటించడం అందరిబాధ్యతగా గుర్తెరగాలని ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్ ఎం సుబాష్ చంద్రబోస్ అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బస్ స్టాండ్ ఆవరణ, పంటకాల్వల్లో పేరుకుపోయిన చె త్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఎన్జీవోలతో కలసి తొలగించి శుభ్రంచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రజలు ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త, వ్యర్థాలు పంటకాల్వలు, నీటివనరులు, డ్రైన్లలో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందచేసి సహకరించాలన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వ డం ద్వారా పారిశుధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఉ య్యూరును స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, అందమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ఆంద రంకలసి పనిచేద్దామని కోరారు.

## అడవి రాజుపాలెం రైల్వే అండర్‌పాస్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి....






**కావలి: విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** కావలి నియోజకవర్గ ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అడవి రాజుపాలెం రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనులను శనివారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మద్దూరుపాడు సమీపంలోని ఎల్‌సీ నెం.160 వద్ద జరుగుతున్న అండర్‌పాస్ నిర్మాణ పనులను రైల్వే అధికారులతో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే,పనుల పురోగతిపై సమగ్రంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా రైల్వే అధికారులు నిర్మాణ పనుల వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. అండర్‌పాస్ నిర్మాణంలో సాంకేతిక అంశాలు, పనుల పూర్తి గడువు, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులతో చర్చించారు. పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అండర్‌పాస్ నిర్మాణం పూర్తయితే మద్దూరుపాడు, పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో చేపట్టినట్లు ఎమ్మెల్యే చెప్పారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా అండర్‌పాస్ నిర్మించాలని అధికారులకు సూచించారు.ఈ అండర్‌పాస్ పూర్తయిన తర్వాత కావలి వైకుంటపురం,పెంకులు ఫ్యాక్టరీ ప్రాంత ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు అత్యవసర సేవల రాకపోకలు కూడా సులభతరం అవుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల భూమిని ఆక్రమిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుని వెంటనే సస్పెండ్ చేయాలి

దివ్యాంగుల నేత మండవ వెంకట్రావు

**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** కావలి పట్టణం ముసునూరు ఏరియా దివ్యాంగుల కాలనీలో దివ్యాంగుల స్థలాలలో సకలాంగులు కొందరు అక్రమంగా ఆక్రమించి ఇల్లు కట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారని వారిని తక్షణమే తొలగించి దివ్యాంగుల స్థలాలను దివ్యాంగుల కేటాయించాలని కోరుతూ శనివారం టిడిపి విభిన్న ప్రతిభావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు మండల వెంకట్రావు ఆధ్వర్యంలో దివ్యాంగులు కావలి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా మండల వెంకట్రావు మాట్లాడుతూ దివ్యాంగుల కాలనీలో కొందరు సకలాంగులు వచ్చి దివ్యాంగుల స్థలాలను అక్రమంగా ఆక్రమించారని తెలిపారు రాజు అనే ఓ ఉపాధ్యాయుడు ప్రభుత్వ ఉద్యోగి కూడా ఏమాత్రం భయం లేకుండా దివ్యాంగుల కాలనీలోని పార్క్ స్థలాన్ని ఆక్రమించాడని ఆరోపించారు ఇదే వ్యక్తి గతంలో పార్కు స్థలాలను ఆక్రమించి ఇతరులకు అమ్ముకున్నాడని తెలిపారు ఆ సందర్భంలో దివ్యాంగులమంతా కలిసి ఆందోళన చేయగా ప్రభుత్వ అధికారులు రాజువాక్రమించిన స్థలాలను అందులోని కట్టడాలను తెల్లగించి పార్కును శుభ్రం చేశారని తెలిపారు ప్రస్తుతం రెండవసారి కూడా రాజు అనే ఉపాధ్యాయుడు ఏమాత్రం లెక్క చేయక దివ్యాంగుల




పార్కును ఆక్రమించాడని ఆరోపించారు. అంతే గాక, కొందరు సకలాంగులు, దివ్యాంగుల స్థలాలు ఆక్రమించి, వాటిలో ఇళ్ళు కట్టి, ఆయా ఇళ్లల్లో వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటివన్నీ అధికారులకు తెలిపిన దివ్యాంగులపై ఏమాత్రం జాలి లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.తాను తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర నాయకుడిని అయినా కూడా, దివ్యాంగుల తరపున తాను ఇచ్చే అర్జీలను అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కావలి ఎమ్మెల్యే దృష్టికి కూడా ఈ అక్రమ ఆక్రమణల విషయం తీసుకువెళ్లిన తమ పార్టీ ప్రభుత్వం ఉండి కూడా, తమ మాటలకు తమ ఆందోళనలకు అధికారుల ముందు వెల,వెల బోతున్నాయని తన మెడలో వేసుకున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డును కూడా చూపించారు. అధికారులు స్పందించి, పార్కులో అక్రమ ఆక్రమణలు తొలగించాలని, వ్యభిచారగృహాలు ఖాళీ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. దివ్యాంగులకు కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పార్కు స్థలంలో ఒక కమ్యూనిటీ భవనం నిర్మించాలని దివ్యాంగులు పడుతున్న అవస్థలను ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి అక్రమ ఆక్రమణలను తొలగింపజేయాలని మండవ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు.ఈ ఆందోళనలో ఆయనతో పాటు దివ్యాంగులు,ఎస్కే మహబూబ్ బాషా,ఎస్కే భాషా, కాటమల్ల మాలకొండయ్య, తల్లిబోయిన శ్రీనివాసులు, శ్రీనివాస్,శైలేష్,దేవరకొండ అమరావతి,పద్మావతి, కురుపమ్మ కల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం....

- కావలిలో 48 మంది లబ్ధిదారులకు రూ.35.37 లక్షల చెక్కుల పంపిణీ

మహానాడు తీర్మానాల అమలే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలి : ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..

**కావలి: విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్సలు, ఇతర అవసరాల సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేతుల మీదుగా 35వ విడతలో 48 మంది లబ్ధిదారులకు రూ.35,37,408 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి ఆశీస్సులతో ఇప్పటివరకు కావలి నియోజకవర్గంలో 1,188 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.9,66,47,935 మేర ముఖ్యమంత్రి సహాయనిధి అందజేయడం జరిగిందన్నారు. అవసరమైన సమయంలో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో సీఎంఆర్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఇటీవల మే 27, 28 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం ఘన విజయవంతమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి పలు కీలక తీర్మానాలు మహానాడులో ఆమోదించారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించబడిందన్నారు. అలాగే




పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ మహానాడును విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మహానాడు విజయవంతానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు,నిర్వాహకులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కావలి నియోజకవర్గంలోని 12 క్లస్టర్లు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో మహానాడును ఘనంగా నిర్వహించి పార్టీ పట్ల తమ నిబద్ధత, క్రమశిక్షణను చాటుకున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. మహానాడులో ఆమోదించిన తీర్మానాలను ప్రతి కార్యకర్త అధ్యయనం చేసి వాటి అమలుకు కృషి చేయాలని సూచించారు.కావలి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు విషయంలో తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే పార్టీ లక్ష్యమని చెప్పారు. వచ్చే మహానాడు నాటికి ఈసారి తీసుకున్న తీర్మానాల అమలులో గణనీయమైన పురోగతి సాధించి పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, నారా లోకేష్‌కు మంచి పేరు తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.అదేవిధంగా కావలి




తెలుగుదేశం పార్టీ కార్యాలయం ద్వారా సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సహాయం అవసరమైన ప్రతి అర్హుడికి సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి ప్రభుత్వానికి పంపించడం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధిదారులకు సహాయం అందుతోందన్నారు.ముఖ్యమంత్రి సహాయనిధి కోసం అడిగిన వెంటనే స్పందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కావలి నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు,అల్లూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాస్ రెడ్డి,మాజీ సోమశిల చైర్మన్ కండ్లకుంట మధు బాబు నాయుడు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షురాలు కోసూరి ప్రత్యూష, తెలుగుదేశం పార్టీ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి పనులను పరిశీలించిన..ఎమ్మెల్యే కావ్య







**బోగోలు:విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** నెల్లూరు జిల్లా,బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఆలయ అధికారులు,కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి దేవస్థానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న తూర్పు గాలిగోపురం, పడమర గాలిగోపురం, భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న మెట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణ వేగం, భక్తులకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి వసతులు, రహదారి సౌకర్యాలు, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా ఈ ప్రాంతానికి గుర్తింపుగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, అవసరమైన నిధుల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి చెందడం వల్ల జిల్లాలోని భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు కూడా మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్, శ్రీరామ్ మాలాద్రి కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## కావలి ఏరియా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కే. సుబ్బారెడ్డి పదవీ విరమణ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి....





**కావలి: విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** కావలి పట్టణంలోని ఎస్ఆర్ పార్క్‌లో కావలి ఏరియా ఆసుపత్రిలో 27 సంవత్సరాల పాటు సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా విశిష్ట సేవలు అందించిన డాక్టర్ కే. సుబ్బారెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోటి వైద్యులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ సుబ్బారెడ్డి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి డాక్టర్ సుబ్బారెడ్డిని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ కే. సుబ్బారెడ్డి గత 27 సంవత్సరాలుగా వైద్య రంగంలో అంకితభావంతో పనిచేస్తూ వేలాది మంది రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించారని ప్రశంసించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవడం గొప్ప విషయమని అన్నారు. వైద్య వృత్తిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ సుబ్బారెడ్డి పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. సమాజానికి ఆయన చేసిన సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా తన అనుభవంతో ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు.కార్యక్రమంలో పలువురు వైద్యులు, ప్రముఖులు మాట్లాడుతూ డాక్టర్ సుబ్బారెడ్డి సేవలను గుర్తుచేసుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పదవీ విరమణ వేడుకను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

## అల్లూరు ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ యల్లంటి రాధిక మృతికి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నివాళి..





**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** కావలి పట్టణం 12వ వార్డుకు చెందిన, అల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న యల్లంటి రాధిక అనారోగ్యంతో మృతి చెందడం పట్ల కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం రాధిక నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యల్లంటి రాధిక ప్రభుత్వ ఉద్యోగిగా తన విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలు అందించారని పేర్కొన్నారు. ఆమె మృతి కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా సహోద్యోగులకు, పరిచయస్తులకు తీరని లోటని అన్నారు.రాధిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎమ్మెల్యే, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, కాలనీ వాసులు పాల్గొని యల్లంటి రాధికకు నివాళులర్పించారు

## ఆకుల సువార్తమ్మ ద్వితీయ జ్ఞాపకార్థ స్మారక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి....





**కావలి: విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** జర్నలిస్ట్ హ్యాపీ తల్లి, పాస్టర్ యేసురత్నం సతీమణి ఆకుల సువార్తమ్మ ద్వితీయ జ్ఞాపకార్థ స్మారక కార్యక్రమం కావలి పట్టణంలోని కచ్చేరిమిట్టలోని వారి నివాసంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి



ముఖ్య అతిథిగా హాజరైన కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, ఆకుల సువార్తమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సువార్తమ్మ కుటుంబ విలువలకు, ఆధ్యాత్మిక సేవలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆమె చూపిన ప్రేమ, సేవాభావం, మానవతా దృక్పథం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా పరిచయస్తులకు కూడా ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.సువార్తమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ ఈశ్వరత్నం, కుటుంబ సభ్యులు, బంధువులు, క్రైస్తవ మత పెద్దలు, స్థానిక నాయకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆకుల సువార్తమ్మకు ఘన నివాళులర్పించారు.

VIGNAN PATRIKA APTEL/2024/89102 విజ్ఞాన్ పత్రిక తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

# వన్యప్రాణి సంరక్షణ

ప్రపంచంలో ఎన్నో అడవులున్నాయి
అడవులు అనేవి మానవజాతికి
దేవుడు ప్రసాదించిన సంపద
అడవుల్ని రక్షించుకోవడం
మానవజాతి మనుగడకు అవసరం
అడవుల్లో వన్య మృగాలతోపాటు
రకరకాల చెట్లు, తీగలు, పొదలు
ఎన్నో ఔషద మూలికలు లభిస్తాయి
మనిషికి అడవులు ఎన్నో రకాలుగా
ఉపయోగపడతాయని గ్రహించాలి
వేటగాళ్లు జంతువుల్ని వేటాడడం
ఒక సరదా కాలక్షేపంగా మారింది
ఈనాడు వన్య ప్రాణులను
వదించడం ఎంతో బాధాకరం
అడవులు అంతరించి పోతున్నాయ్
మానవుడు తన స్వార్థం కోసం
అడవుల్ని నరికి వన్య ప్రాణులకు
నిలువ నీడ లేకుండా ప్రయత్నించడం
మనం కూర్చున్న కొమ్మను
మనమే నరుక్కోవడం లాంటిది
ఇప్పుటికైనా అడవుల ఉపయోగాన్ని
తెలుసుకొని అడవుల్ని రక్షించే
ప్రయత్నాన్ని కొనసాగిద్దాం!

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385



## ధూమ, మద్యపాన సేవనంతో కుటుంబాలు ఛిద్రం

యూహెచ్సీ డాక్టర్ రేష్మ, ఎన్టీసీపీ కోఆర్డినేటర్ లలిత




గూడూరు : గూడూరు పట్టణంలోని పెద్ద మసీదు వీధిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్ఎంలు, సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేష్మా, నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం గూడూరు శాఖ కో ఆర్డినేటర్ లలిత మాట్లాడుతూ ఆదివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం కావడంతో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ఆర్ఎంఓ ప్రసన్న సూచనలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించామన్నారు. ధూమ, మద్యపాన సేవనంతో కుటుంబాలు ఛిద్రమవుతాయన్నారు. ముఖ్యంగా యువకులు తమ తండ్రులు, సినిమాలలో హీరోలు సిగరెట్, బీడీ, చుట్ట, హాన్స్ వంటివి తీసుకోవడం చూసి అదొక ఫ్యాషన్ గా భావించి అలవాటు చేసుకుంటున్నారని అన్నారు. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధూమపానం, మద్యం సేవించడం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే మద్యపానం ఆపివేయాలనుకునే వారికి కాళహస్తి, నెల్లూరు ఆస్పత్రులల్లో టోబాకో సెషన్ సెంటర్లలో ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పెద్ద మసీదు వీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ నుండి సాధుపేట సెంటర్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మన గూడూరు - మన సునీల్




గూడూరు నియోజకవర్గం: గూడూరు పట్టణం :- సమ్మర్ కోచింగ్ కార్యక్రమంలో భాగంగా అశోక్ నగర్ ప్రాంతం పిల్లలు హాకీ క్రీడా నేర్చుకుంటున్న క్రమంలో....శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ గారి ఆదేశాల మేరకు.... క్యాంప్ కార్యాలయం నందు పిల్లలకు పట్టణం అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు గారి ఆధ్వర్యంలో హాకీ స్టిక్ లను అందించిన యువత. ఈ కార్యక్రమంలో యువత అధ్యక్షులు ముప్వా చరణ్, వేముల సునీల్, గుండాల ఓం ప్రకాష్, గుండాల సందీప్, అల్లం వెంకట సాయి,జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా ఆల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

### పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ టాపర్స్ కు ఘన సత్కారం...





**ఒంగోలు మే 30 విజ్ఞాన్ పత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో :** ఒంగోలు సమీపంలోని సూరారెడ్డి పాలెం, ఆర్.బి. బ్లిస్ లేఅవుట్,ఐఓసి పెట్రోల్ బంక్ పక్కన,జూన్ 3వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఈ మెగా ఈవెంట్ జరగనుంది.గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 570కి పైగా మార్కులు, అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో 580కి పైగా మార్కులు సాధించిన టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఈ అవార్డులను అందజేస్తారు.అలాగే ఇంటర్మీడియట్ మొదటి మరియు ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 990 మార్కులకు పైగా సాధించిన టాపర్స్ను కూడా ఈ వేడుకలో ప్రత్యేకంగా సత్కరించనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, నారా లోకేష్, మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణ రెడ్డి విచ్చేస్తుండగా, గౌరవ ఎంపీలు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టి.కృష్ణప్రసాద్ మరియు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.వీరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నందమూరి బాలకృష్ణ, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, సినీ నటి ప్రియా హెగ్డే పాల్గొననున్నారు.ప్రముఖ యాంకర్లు ఉదయభాను, శ్రీముఖి, సుమ ఈ వేడుకకు యాంకరింగ్ చేయనున్నారు.ఈ సందర్భంగా శ్రేయ ఇన్ఫ్రా ప్రతినిధులు మాట్లాడుతూ, ఒంగోలులో తమ నూతన కార్యాలయాన్ని కూడా అదే రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నామని, వచ్చే ఏడాది నుండి టాపర్స్ అందరికీ శ్రేయ ఇన్ఫ్రా తరపున స్పాన్సర్షిప్ అందిస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ప్రజలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుచున్నారు.

## ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఈఎస్ఐ సేవలు వినియోగించుకోండి.

### బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి వెంకట లక్ష్మమ్మ.




నెల్లూరు :- సంక్షేమ శాఖల హాస్టల్లో పనిచేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఈఎస్ఐ సేవలు వినియోగించుకోవాలని జిల్లా బీసీ సంక్షేమం మరియు సాధికారిత అధికారిణి పి వెంకట లక్ష్మమ్మ సూచించారు. శనివారం నెల్లూరులో ఆర్టీసీ వద్దనున్న బీసీ స్టడీ సర్కిల్ భవనం నందు జిల్లాలోని సంక్షేమ శాఖల ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఎనిమిదవ వార్షికోత్సవ సమావేశం జరిగింది. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు గవర్నమెంట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ వార్షికోత్సవ సమావేశానికి వెంకట లక్ష్మమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈపీఎఫ్ చందాదారుల వారసులకు వైద్య విద్య సీట్ల భర్తీలో నాలుగు శాతం రిజర్వేషన్ ఉందన్నారు. అర్హత ఉన్న వారందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. సంక్షేమ హాస్టల్ లో పనిచేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పేద విద్యార్థులకు మంచి సర్వీస్ అందజేయాలన్నారు. వేతనం తక్కువ అయినప్పటికీ అంకిత భావంతో పని చేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాయల ముద్దుకృష్ణ, ప్రధాన కార్యదర్శి షేక్ బాజీ భాష, నాయకులు కోదండరామయ్య, బ్రహ్మయ్య, పెంచలయ్య, లీలావతి, వెంకట రాధమ్మ, బుజ్జమ్మ ,సుమిత్ర దేవి జిల్లాలోని ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్లోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మాలల సంక్షేమ ఐక్యవేదిక ఆధ్వర్యంలో...

మాల సంఘాల జేఏసీ అంబేద్కర్ యువజన సంఘాలతో...

మాలల ఐక్యతా చైతన్య యాత్ర...




**ఒంగోలు మే 30 విజ్ఞాన్ పత్రిక ప్రకాశం జిల్లా బ్యూరో:** ఈ రోజు ఒంగోలు ఎఘ్న భవన్ లో మాలల సంక్షేమ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మాల మహాసభ, మాల మహానాడు. మాల విద్యార్థి సంఘం. హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకు మాలల ఐక్యత చైతన్య యాత్ర నిర్వహిస్తున్నాం.నిర్వహణ కమిటీ నాయకులు డాక్టర్ కోట్ల గంగాధర్, మల్లెల వెంకట్రావు ఎఘ్న భవన్ లో జరిగిన మాలల సమావేశం లో అతిధులు గా పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాల మహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాలలను విద్య ఉద్యోగ రాజకీయ సంక్షేమ రంగాలలో అణిచివేసేందుకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని తీసుకు వచ్చింది. జనాభా ప్రాతిపదిక మీద వర్గీకరణ చేస్తున్నామని చెప్పి 12 శాతం ఉన్న మాలలకు 7:1/2 రిజర్వేషన్ మాత్రమే కేటాయించి నాలుగు శాతం ఉన్న మాదిగలకు ఆరున్నర శాతం రిజర్వేషన్లు ఇవ్వడం మాలల పట్ల ఉన్న వివక్షకు నిదర్శనం. మాల ఉద్యోగులకు ప్రాధాన్యత లేని పోస్టులను కేటాయిస్తూ ప్రమోషన్లలో మాదిగలకు ప్రాధాన్యమైన సీట్లను ఇవ్వడం మాల ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఏసీబీ దాడులు చేస్తూ వారిని భయభ్రాంతులను చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఎన్నికల్లో నెగ్గిన మాల శాసనసభ్యులు పార్లమెంటు సభ్యులపై అగ్రకుల శాసనసభ్యులు పార్టీ నాయకులు స్వారీ చేస్తూ నియోజకవర్గాలలో ఖర్చు చేయాల్సిన నిధులను దారి మళ్లిస్తున్నారు మాల శాసనసభ్యులున్న చోట్ల పార్టీ అగ్రకుల నాయకులను ఇన్చార్జిలుగా వేసి రాజ్యాంగ హక్కుల అతిక్రమిస్తున్నారు. గ్రామాలలో మాలలపై అగ్రకుల వేధింపులు పెరిగిపోయాయి అధికార మదంతో నిరంతరం మాలలపై దాడులు చేస్తూ ఎన్నో సంవత్సరాలుగా మాలలు సాగు చేసుకుంటున్నా అసైన్మెంట్ భూములు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుంటూ దౌర్జన్యకాండ కొనసాగిస్తున్నారు కాపాడాల్సిన పోలీస్ యంత్రాంగం నిందితులతో కొమ్మక్కై బాధితులపైనే కేసులు . పెడుతున్నారు. రెవెన్యూ అధికారులు మాలల భూములను రికార్డులలో తారుమారు చేస్తున్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ చట్టంలో రోస్టర్ పాయింట్లు మాదిగలకు అనుకూలంగా మార్చి మాల విద్యార్థుల నిరుద్యోగుల అవకాశాలను మాదిగ విద్యార్థులకు కట్టబెడుతున్నారు ఇంజనీరింగ్ మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సూపర్ స్పెషాలిటీ కోర్సులలో మాల విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవ మత సంస్థలు చర్చిలు పై దాడులు చేస్తూ భయభ్రాంతులను చేస్తున్నారు. చర్చిలకు వెళ్లే వాళ్లకు షెడ్యూల్డ్ కులం గుర్తింపును రద్దు చేస్తామని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఈ పరిస్థితులలో 80 లక్షల మంది మాలలను



రాజకీయాలకు అతీతంగా ఒక వేదిక మీదకు తీసుకువచ్చి మాలలకు రాజ్యాంగబద్ధంగా వచ్చే హక్కులను రక్షణలను [illegible] కాపాడుకునేందుకు ఆగస్టు నెలలో విజయవాడలో జరుగు మాలల సింహగర్జనకు తరలి రావాల్సిందిగా మల్లెల వెంకట్రావు పిలుపునిచ్చారు. మాలల సంక్షేమ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గంగాధర్ గారు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు మాల కార్పొరేషన్ కు నిధులు కేటాయించకుండా ఆ నిధులను పక్కదారి పట్టించి మాల నిరుద్యోగులను ఆర్థికంగా ఎదగకుండా మాదిగలకు మాత్రం డప్పు కళాకారులు చెప్పు కళాకారులు అని ఎస్సీ కార్పొరేషన్ నిధుల ద్వారా పెన్షన్లు అందిస్తున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ రానున్న ఎన్నికలలో మాదిగలకే సీట్లు ఇచ్చి మాలలను సర్వనాశనం చేయాలని కుట్ర పన్నుతున్నారు మాల పల్లెలోని ప్రాథమిక పాఠశాలలను పథకం ప్రకారం రద్దు చేస్తున్నారు జనాభా లెక్కలలో మాలల జనాభాను తగ్గించి దళిత క్రైస్తవులుగా అందరిని బీసీలలో కలిపి ఈ రాష్ట్రంలో మాదిగ జనాభా మాలల కంటే ఎక్కువ అని చెప్పే కుట్ర చేస్తున్నారు కనుక మాల విద్యార్థులు ఉద్యోగులు రాజకీయ నాయకులు అంబేద్కర్ యువజన సంఘాలు మహిళలు చైతన్యంతో ఉండి జనాభా లెక్కలలో మరియు ఓటరు జాబితాల సవరణలో తప్పనిసరిగా పేర్లు నమోదు చేయించాల్సిందిగా పిలుపునిచ్చారు, మాల మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ దండేలా కృష్ణ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాల మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ దండేల కృష్ణ మాల విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సుబ్బారాయుడు మాల మహాసభ నెల్లూరు కన్వీనర్ గణేష్ మాల మహాసభ ప్రకాశం జిల్లా కన్వీనర్ వేమా బాలకోటేశ్వరరావు నూకతోటి కార్తీక్, శానం కిషోర్, నూకతోటి వెంకటేష్, తాళ్లూరి నాగబాబు,మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# "రేణమాలలో టీడీపీ జోరు..
# ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో 500 మంది భారీ చేరికలు.!"

ప్రజల విశ్వాసమే టీడీపీ బలం -- రేణమాల

**అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!**

కొండాపురం మే 29న : కొండాపురం మండలం రేణమాల గ్రామంలో తెలుగుదేశం పార్టీకి భారీగా ప్రజా మద్దతు లభించింది. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఈనకొల్లు బ్రహ్మరెడ్డి, షేక్ రంతుల్లా, గోతం ప్రభాకర్ రెడ్డి, అంబులూరి నర్సారెడ్డి, కందే శ్రీను, కామినేని దయాకర్, గాలంకి శివ, కూనం రామిరెడ్డితో పాటు సుమారు 500 మంది కార్యకర్తలు, యువత, మహిళలు మరియు గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మండల కన్వీనర్ పోలినేని





చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసంతో ప్రజలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే పార్టీ టీడీపీ మాత్రమేనని పేర్కొన్నారు. ారేణమాల గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని, గ్రామంలో ఉన్న శ్రీ రాములవారి దేవాలయానికి సంబంధించిన సమస్యను, అలాగే తాగునీటి సమస్యను, సీసీ రోడ్లను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబు నాయుడు, మాజీ జెడ్పీటీసీ దామా మహేశ్వరరావు, ఉదయగిరి నియోజకవర్గ టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ తాటికొండ అనూష, క్లస్టర్ ఇంచార్జ్ పోలినేని రమేష్, మాజీ మండల కన్వీనర్ తలపనేని లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు గోతం కొండారెడ్డి, సొసైటీ అధ్యక్షులు అల్లిక మధు, కుంకు మోహన్ రావు, మండల తెలుగు యువత అధ్యక్షులు దాసరి అశోక్, ఓరుగంటి సుమన్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమెరికా -- ఇరాన్ ఒప్పందంపై ముమ్మర చర్చలు..
# పంతం వీడని నేతలు.. సస్పెన్స్‌లో గ్లోబల్ డీల్!




అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకమైన అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరే అవకాశం ఉన్న ఒక ఒప్పందంపై చర్చలు ముమ్మరమవుతున్నాయి. అయితే, ఈ చర్చలు తుది దశకు చేరుకున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఇంకా ఎలాంటి తుది నిర్ణయం జరగలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌లోని అత్యంత సురక్షితమైన 'సిట్యుయేషన్ రూమ్'లో ప్రతిపాదిత ఒప్పంద ముసాయిదాపై దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకమైన అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరే అవకాశం ఉన్న ఒక ఒప్పందంపై చర్చలు ముమ్మరమవుతున్నాయి. అయితే, ఈ చర్చలు తుది దశకు చేరుకున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఇంకా ఎలాంటి తుది నిర్ణయం జరగలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌లోని అత్యంత సురక్షితమైన 'సిట్యుయేషన్ రూమ్'లో ప్రతిపాదిత ఒప్పంద ముసాయిదాపై దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం (మే 29) జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశం అనంతరం కూడా ఎలాంటి నిర్ధారణలకు రాలేకపోయినట్లు సమాచారం. ప్రాంతీయ సంఘర్షణను ముగించే లక్ష్యంతో రూపొందించిన ఈ ఒప్పందంపై వైట్ హౌస్ తమ వైఖరిని స్పష్టం చేసింది. అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా, అధ్యక్షుడు ట్రంప్ నిర్దేశించిన కఠినమైన షరతులు , రెడ్ లైన్‌లను నెరవేరిస్తేనే ఏదైనా ఒప్పందం కుదురుతుందని స్పష్టం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్‌ను అణ్వాయుధాలు కలిగి ఉండటానికి అనుమతించబోమని సమావేశం అనంతరం ఒక వైట్ హౌస్ అధికారి అంతర్జాతీయ వార్తా సంస్థ ఏఎఫ్‌పీతో పునరుద్ఘాటించారు. మరోవైపు, చర్చలు జరుగుతున్న మాట వాస్తవమే అయినా, ఇంకా తుది ఒప్పందం కుదరలేదని ఇరాన్ కూడా వెల్లడించింది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రతిపాదిత ఒప్పందానికి సంబంధించిన కొన్ని కీలక వివరాలను పంచుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత వ్యూహాత్మకమైన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవడం, అంతర్జాతీయ సముద్రయానానికి ఉన్న అడ్డంకులను తొలగించడం, ఇరాన్ సుసంపన్న యురేనియం నిల్వలకు సంబంధించి ఇరు దేశాల మధ్య గతంలో ఉన్న ఒప్పందాలను రద్దు చేయడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ట్రంప్ చేసిన ఈ వాదనలను ఇరాన్ తీవ్రంగా ప్రశ్నించింది. ట్రంప్ అందించిన సమాచారం పూర్తిగా కచ్చితమైనది కాదని, అది కేవలం నిజానిజాల మిశ్రమమని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ 'ఫార్స్' విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పేర్కొంది. ముఖ్యంగా ఇరాన్ అణు కార్యక్రమం, హోర్ముజ్ జలసంధి నియంత్రణపై ట్రంప్ చేసిన వాదనలు వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించడం లేదని స్పష్టం చేసింది. ఈ సంభావ్య ఒప్పందంలో భాగంగా విదేశాల్లో స్తంభింపజేసిన తమ బిలియన్ల డాలర్ల ఆస్తులను, నిధులను పునరుద్ధరించాలని ఇరాన్ గట్టిగా డిమాండ్ చేస్తోంది. అమెరికా, ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఈ అనిశ్చితి అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన చమురు రవాణా మార్గాలలో ఒకటైన హోర్ముజ్ జలసంధి గుండానే ప్రపంచ చమురు సరఫరాలో ఎక్కువ భాగం సాగుతుంది. అక్కడ ఉద్రిక్తతలు పెరిగితే, అది ప్రపంచ చమురు సరఫరాను దెబ్బతీసి, ధరలు ఆకాశాన్నంటేలా చేస్తుందని అంతర్జాతీయ పెట్టుబడిదారులు నిశితంగా గమనిస్తున్నారు. మరోవైపు, పశ్చిమ ఆసియాలో శాంతి సూచనలు కనిపించడం లేదు. ఇటీవల ప్రకటించిన కాల్పుల విరమణను ఉల్లంఘించారని అమెరికా, ఇరాన్‌లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నాయి. అలాగే లెబనాన్‌లో ఇజ్రాయెల్, ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా దళాల మధ్య పోరాటం ఎటువంటి తగ్గుదల లేకుండా కొనసాగుతోంది. ఈ ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా-ఇరాన్ ఒప్పందం ఎంతవరకు సఫలమవుతుందనేది వేచి చూడాలి.

Printed by: komalagunta Nageswara Rao D.NO.16-256/3,UP Stair,Near Hanuman Temple, sankaraiah Buildings,Rayaji street, Nellore, sri potti sriramulu Nellore Dist. ANDHRAPRADESH PiNNo-524001, Published by : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Owned by : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Printed at : Deepak roshan Graphics Digital&Mutt colour printers, D.NO.16-256/3,UP Stair,Near Hanuman Temple, sankaraiah Buildings,Rayaji street, Nellore, sri potti sriramulu Nellore Dist. ANDHRAPRADESH PiNNo-524001, published at :D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District, Editor : KALIKI UDAYKUMAR REDDY D.NO.Lig1-697, kalluru palli Housing Board colony, Nellore-524004 S.P.S.R Nellore District,